'మద్య'ంతరంగా రోడ్డున పడేస్తున్నారు

'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తాం. లేదా నిరుద్యోగ భృతి తొలి నెల నుంచే ఇస్తాం'ఇవీ ఎన్నికల సమయంలో కూటమి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీ. దీనికి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఏపీ బెవరేజెస్ ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బందిని నిరుద్యోగులను చేసేందుకు రంగం సిద్ధం చేశారు. నూతన మద్యం పాలసీతో తమను బతుకుల్ని రోడ్డున పడేస్తున్నారని సిబ్బంది వాపోతున్నారు.

- పాత మద్యం పాలసీ రద్దుతో ప్రభుత్వ దుకాణాల సిబ్బంది మెడపై కత్తి
- నియోజకవర్గంలో 106 దుకాణాల్లోని 530 మంది సిబ్బంది తొలగింపునకు రంగం సిద్ధం
- ప్రత్యామ్నాయ ఉపాధి చూపకుండానే వీధిన పడేస్తున్న కూటమి ప్రభుత్వం
- న్యాయం చేయాలని ఆందోళన బాట పట్టిన ఏపీ బెవరేజెస్ దుకాణాల సిబ్బంది



బెవరేజెస్ కంపెనీ ప్రతినిధికి వినతిపత్రం అందిస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది



పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెం ఏపీ బెవరేజెస్ కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న మద్యం దుకాణాల సిబ్బంది

పెందుర్తి: 2019లో సీఎంగా వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం పాలసీని విప్లవాత్మకంగా అమలు చేస్తూ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలను నడిపారు. ఆ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగ యువతను ఆయా షాపుల్లో నియమించి, ఉపాధి కల్పించింది ప్రభుత్వం. తాజాగా నాటి మద్యం పాలసీని రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రైవేట్ నిర్ణయంతో నియోజకవర్గంలోని 106 ఏపీ బెవరేజేస్ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న 530 మంది సిబ్బంది ఉపాధి కోల్పోనున్నారు.

అప్పుడు మంచి వేతనం

గత ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ప్రవేశపెట్టినప్పుడు ప్రభుత్వమే మద్యం దుకాణాలను నడిపేందుకు రూపకల్పన చేసింది. ఆయా దుకాణాల్లో మద్యం అమ్మకాల కోసం షాప్‌లో విధులు నిర్వహించేందుకు ఒక సూపర్‌వైజర్, ముగ్గురు సేల్స్‌మెన్, ఒక సెక్యూరిటీ సిబ్బందిని జిల్లా జాయింట్ కలెక్టర్‌ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించి మరీ పారదర్శకంగా నియామకాలు జరిపారు. సూపర్ వైజర్‌కు రూ.18 వేలు, సేల్స్ మెన్‌కు రూ.16,500, సెక్యూరిటీ సిబ్బందికి రూ.10 వేలు చొప్పున వేతనం అందించారు. ఈ క్రమంలో స్థానిక నివాసితులు తమ కుటుంబ పోషణకు సదరు ఆదాయం సరిపోయేది.

ప్రత్యామ్నాయ ఉపాధిపై స్పష్టత కరవు

తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకురానున్న మద్యం పాలసీతో దుకాణాలన్నీ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోనున్నాయి. ఈ నేపథ్యంలో వేలంలో దుకాణాలను దక్కించుకునే వారు పాత సిబ్బందిని అదే వేతనంతో కొనసాగించే పరిస్థితి లేదు. ఎందుకంటే ప్రస్తుతం ఉన్నవారి స్థానంలో వారి మనుషులనే నియమించుకుంటారు. దీంతో ఇప్పటివరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న వారంతా ఒక్కసారిగా రోడ్డున పడే పరిస్థితి. వీరికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన లేదు. ప్రభుత్వ పెద్దలు స్పందించి తమను ఆదుకోవాలని వీరంతా కోరుతున్నారు.

సిబ్బంది ఆందోళన

ప్రభుత్వం తమను అర్ధంతరంగా తొలగిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని.. తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని కోరుతూ పెందుర్తి జెర్రిపోతులపాలెంలోని ఆంధ్రప్రదేశ్ బెవరేజస్ కంపెనీ(డీపో-2) ఎదుట బెవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వేల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ధర్నా చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తమ భవిష్యత్ గురించి స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఈ మేరకు డిపో ప్రతినిధులకు వినతిపత్రం అందించారు.

15 వేల మంది నిరుద్యోగులవుతారు



ఐదేళ్లుగా మద్యం దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు ఉన్నపాటుగా ఉద్యోగాల నుంచి తొలగిస్తే మా కుటుంబాలు అన్యాయం అయిపోతాయి. రాష్ట్ర వ్యాప్తంగా చూసుకుంటే దాదాపు 15 వేల మంది రోడ్డున పడే పరిస్థితి. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన మమ్మల్ని తొలగిస్తే ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి.

– యర్రా సోంబాబు, సేల్స్‌మెన్, ఆరిపాక, సబ్బవరం

స్పష్టమైన హామీ ఇవ్వాలి



ఇన్నాళ్లు ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడంలో ఎంతగానో కష్టపడ్డాం. ప్రభుత్వం మారిన వెంటనే మా బతుకులు కూడా రోడ్డున పడతాయని అనుకోలేదు. మా జీవితంలో ఐదేళ్లు ఈ పనే చేశాం. ఇప్పుడు ఉపాధి భయం పట్టుకుంది. యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. స్పష్టమైన హామీ ఇచ్చి, మమ్మల్ని ఆదుకోవాలి.

– పోతల మోహనరావు, సూపర్‌వైజర్

కరోనాలోనూ పనిచేశాం



ఉపాధి కోసం వెతుకుతున్న సమయంలో గత ప్రభుత్వం మద్య దుకాణాల ద్వారా ఉపాధి కల్పించారు. గౌరవ ప్రద వేతనం ఇచ్చారు. కరోనా సమయంలో కూడా ప్రభుత్వ, మద్యం వినియోగదారుల అవసరాల మేరకు విధులు నిర్వహించాం. ఇప్పుడు ఇలా మమ్మల్ని రోడ్డున పడేసే పరిస్థితి వస్తే ఎలా బతకాలి. ప్రభుత్వం మా గురించి ఆలోచించాలి.

– కిల్లాడి గణేష్, సూపర్‌వైజర్, గాజువాక

ఈకేవైసీ తప్పనిసరి



వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి, గ్రామ ప్రతినిధులు, రైతులు

పరవాడ: ప్రస్తుత ఖరీఫ్ సీజన్ వరి పంటకు ఈ-పంట నమోదుతోపాటు ఈకేవైసీ చేయడం ద్వారా ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం వర్తింపజేస్తుందని పరవాడ మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి అన్నారు. పరవాడ, వెన్నలపాలెం గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం రాయితీపై అందించనున్న డ్రోన్లను అర్హులైన రైతులు తీసుకుని ఎరువులు, పురుగు మందులు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో పిచికారీ చేసుకోవచ్చన్నారు. దీని ద్వారా పంట పెట్టుబడులు తగ్గించుకుని అధిక దిగుబడులు పొందవచ్చని పేర్కొన్నారు. పాడి పశువుల సంరక్షణకు షెడ్ల నిర్మాణానికి పశుసంవర్ధక శాఖ ఉపాధి హామీ పథకం ద్వారా అందిస్తున్న 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. జాతీయ ఉపాధి పథకంలో వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ కుంటలు, పంట పొలాలకు రహదారులు నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. రైతులు ఎప్పటికప్పుడు కొత్త పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం అమలుచేసే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు రావాలని సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు పిలుపునిచ్చారు. అర్హులైన రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించి వారికి అవకాశమున్న పథకాలను పొందాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు ప్రతినిధులు పైల రామచంద్రారావు, రెడ్డి శ్రీనివాసరావు, పైల అప్పలనాయుడు, వెన్నల సన్యాసిరావు, చుక్క అప్పలనాయుడు, సిరపరపు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సబ్బవరం ఎంపీడీవోగా పద్మజ



సబ్బవరం: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా పి.పద్మజ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లి, సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఆమె గతంలో పరవాడ ఈవోపీఆర్డీగా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆమె మీడియాతో మాట్లాడుతూ మండల ప్రజలు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఘనంగా అన్నసమారాధన



దిబ్బపాలెంలో అన్నసమారాధనలో పాల్గొన్న నాయకులు

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు దిబ్బపాలెం గ్రామంలో గణపతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు తొలుత గణపతిని దర్శించుకుని, పూజలు జరిపారు. అనంతరం మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అరిజిల్లి దేవిరవి, మాజీ ఎంపీటీసీ అమ్మోరు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన చేస్తున్న విద్యార్థులతో చైర్మన్ సత్యనారాయణ తదితరులు

గోపాలపట్నం: నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా మంగళవారం నిర్వహించిన రక్త దాన శిబిరాన్ని కళాశాల చైర్మన్ జి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం చేయడం ఎంతో మంచి విషయమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ ప్రదీప్ వర్మ మాట్లాడుతూ రక్తదానం అంటే మరొకరి ప్రాణాలను కాపాడడమేనన్నారు. శిబిరంలో సుమారు 100 యూనిట్లు రక్తాన్ని సేకరించామని తెలిపారు. ఇందుకు సహకరించిన అమ్మ బ్లడ్ బ్యాంక్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిట్టిమిరెడ్డి వీరునాయుడు, కళాశాల బోర్డు డైరెక్టర్ బోను భాస్కరరావు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్లు



వాలిమెరకలో కరపత్రం అతికిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు, గండి బాబ్జీ

పెందుర్తి: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మండలంలోని వాలిమెరకలో మంగళవారం పర్యటించారు. 100 రోజులుగా కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కూటమి నాయకులు ఇంటింటికీ వెళ్లి 'ఇది మంచి ప్రభుత్వం'స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నరవలో 'పొలం పిలుస్తోంది'



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

పెందుర్తి: జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం నరవలో పర్యటించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. వరి సాగు, అధిక దిగుబడిపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఆత్మ పథకం పీడీ ఆశాదేవి, మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు ప్రాధాన్యం

- లోకల్ క్రైసిస్ గ్రూప్ సమావేశంలో అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

పరవాడ: కార్మికుల భద్రతకు పరిశ్రమల యాజమాన్యాలు అధిక ప్రాధాన్యత కల్పించేందుకు ముందుకు రావాలని అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ పిలుపునిచ్చారు. ఫార్మాసిటీలోని ఎంఎఎస్ఆర్ఎం సమావేశ మందిరంలో లోకల్ క్రైసిస్ గ్రూప్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో మాట్లాడుతూ అచ్యుతాపురంలోని ఎసైన్షియా పరిశ్రమలో జరిగినట్లు ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల పూర్తి వివరాలు జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తే వెంటనే పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. డిప్యూటి చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ మాట్లాడుతూ మాక్ డ్రిల్‌తో పాటు, సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించి వాటి నివేదికల మేరకు యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పైడి చిన్నారావు మాట్లాడుతూ పరిశ్రమల్లో ముందస్తు తనిఖీలు నిర్వహించి, ఆఫ్‌సైట్, ఆన్‌సైట్ ఎమర్జెన్సీ ప్లాన్‌లు పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. సిబ్బందికి నైపుణ్య శిక్షణ మెరుగుపరచాలన్నారు. కార్మిక సంక్షేమానికి పరిశ్రమల శాఖ తనిఖీ అధికారులు ఎంతగానో కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జేఎన్ ఫార్మా కార్యదర్శి జెట్టి సుబ్బారావు, లోకల్ క్రైసిస్ గ్రూప్ సభ్యులు డాక్టర్ వాకా చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ హనుమంత లక్ష్మణరావు, జి.రమేష్‌కుమార్, పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం



పీహెచ్‌సీ ఆవరణలో నిర్మించిన పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

సబ్బవరం: ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం చేరువ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను ఎంపీపీ బోకం సూర్యకుమారితో కలిసి మంగళవారం ప్రారంభించారు. ముందుగా పారిశుధ్య నిర్వహణలో భాగంగా పంచాయతీలకు సమకూర్చిన 6 ట్రాక్టర్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.పద్మజ, వైస్ ఎంపీపీ దాడి రూసీస్లలక్ష్మీరాణి, ఎంపీటీసీలు బైలపూడి దేముడుబాబు, చైతన్య, కూటమి నాయకులు బర్నికాన బాబూరావు, గొర్లి రామునాయుడు, ఇందల రమణ, సాలాపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సింహగిరిపై వైభవంగా శాంతి హోమం

- ఆలయం, ప్రసాదాల తయారీశాల సంప్రోక్షణ



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం ఉదయం శాంతి హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఇటీవల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి లడ్డూల తయారీకి, స్వామివారికి సేవలకు వినియోగించే నెయ్యికి సంబంధించి చోటుచేసుకున్న పరిణామాల కారణంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో చక్రపెరుమాళ్లని హోమగుండం వద్ద కొలువుంచారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రధాన కలశంతో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ప్రదక్షిణ చేశారు. ఆ కలశంలోని జలాలతో ప్రసాదాల తయారీశాలను సంప్రోక్షించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేషబాబు, ఆలయ అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా సమితి(ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ నివేదిత, డాక్టర్ రత్నప్రకాష్, డాక్టర్ సత్యనారాయణ, ఎంవీ రామకృష్ణ, కంప్యూటర్ అధ్యాపకులు జె.గణేష్,, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లెక్కల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ బోరయ్యకు గండి రవి పరామర్శ



బోరయ్యను పరామర్శిస్తున్న గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: జీవీఎంసీ 88వ వార్డు పరిధి వెదుళ్లనరవకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోరయ్యను ఆ పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన బోరయ్య ఇంటి వద్దకు వెళ్లి, ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ సారిపల్లి పైడిరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, నాయకులు బొట్టా ముత్యాలు, ఐడీ బాబు, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సామూహిక సీమంతాలు



గర్భిణులకు కిట్లు అందిస్తున్న పంచకర్ల

పెందుర్తి: పౌష్టికాహార వారోత్సవాల సందర్భంగా పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం సామూహిక సీమంతాలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం, మందులు తీసుకుంటో ఆరోగ్యవంతమైన బిడ్డ పుడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వర్షం



ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

పరవాడ: పరవాడలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గంటకు పైగా కురిసిన వానతో గెడ్డలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో రోడ్లు ముంచెత్తాయి. స్థానిక ఎస్సీ కాలనీ వీధుల్లో నీరు భారీగా నిలిచిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీగా కురిసిన వర్షానికి పరవాడ పెద్ద చెరువు కళింగ జోరుగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.